క్లుప్తంగా

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 26వ తేది నుంచి మహిళలకు టైలరింగ్, బ్యూటీ పార్లర్, ఎంబ్రాయిడరీలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, ఎంబ్రాయిడరీలో 31 రోజులు, బ్యూటీ పార్లర్‌లో 35 రోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణా సమయంలో అభ్యర్థినిలకు ఉచిత భోజన, సదుపాయాలు కల్పిస్తారన్నారు. వివరాలకు 94409 05478, 99856 06866, 94409 33028 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అధిక ఫీజు వసూళ్లను ఆపండి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న జూనియర్ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం (పిఆర్ఎస్ వైఎఫ్) జిల్లా కన్వీనర్ ఒరుగంటి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం కడపలో ఆర్.ఐ.ఓ వెంకటసుబ్బయ్యను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా నాగేంద్రబాబు మాట్లాడుతూ ఖాజీపేట మండల పరిధిలో బీరం శ్రీధర్ రెడ్డి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల, కడప నగరంలోని జిల్లా పరిషత్ ఆవరణంలో ఉన్న బీరం శ్రీధర్ రెడ్డి జూనియర్ కళాశాలలో విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విచారించి చర్యలు తీసుకోవాల ని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్ వైఎఫ్ నగర నాయకులు అఫ్జల్, వినయ్, సురేంద్ర, అశోక్, సమీర్, ప్రణయ్, సుధీర్ పాల్గొన్నారు.

గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా శివశంకర్



కడప రూరల్ : గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా సారకాయల శివ శంకర్, జిల్లా అధ్యక్షులుగా మోటా రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఇరసాల రమేష్, ఉపాధ్యక్షులుగా జంగిలి భారతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖ పట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి సర్వసభ్య సమావేశంలో జాతీయ అధ్యక్షులు కె.వివేక్‌నాయక్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా నియామకాలు చేపట్టినట్లు శివశంకర్ తెలిపారు. జిల్లా కమిటీలో పనిచేస్తూ గిరిజనుల అభ్యున్నతి కోసం కృషి చేశామన్నారు. అందుకు గుర్తింపుగా తమను ఏకగ్రీవంగా ఎన్నిక చేయడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

ఆధునిక సాగు పద్ధతులు పాటించాలి

కడప అగ్రికల్చర్: పంటల సాగులో ఆధునిక పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులను సాధించవచ్చని కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా కడప మండల పరిధిలోని మోడమీదపల్లి, పాతకడప గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వరినారు మడులకు సంబంధించి ప్రధాన పొలాల్లో రైతులు కేఎస్‌శ్రీం-1638, 733 రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. ప్రస్తు తం వర్షాభావ పరిస్థితుల్లో వరినాట్లు వేసిన పొలాల్లో మూడు రోజుల నుంచి ఎండిపోయి, మాడు లక్షణాలు కనిపిస్తున్నాయన్నారు. వీటి నివారణకు పాలిఫీడ్-19-19-19ను 5 గ్రాము లు, చిలేటెడ్ జింక్ సల్ఫేట్ 0.2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలన్నారు.

రిమ్స్‌లో గుర్తుతెలియని మృతదేహాలు





కడప అర్బన్: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో గుర్తు తెలియని ఒక మగ, ఒక ఆడ మృతదేహాలు మార్చురీలో వుంచారు. వారి ఆచూకీ తెలిసిన వారు తగిన ఆధారాలతో తమను సంప్రదించాలనీ రిమ్స్ అధికారులు తెలియజేశారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం

– సార్వత్రిక సమ్మెలో విద్యుత్ ఉద్యోగ సంఘ నాయకుల పిలుపు



సార్వత్రిక సమ్మెలో భాగంగా విద్యుత్ భవన్ ఎదుట ఆందోళన చేస్తున్న జేఏసీ నాయకులు

కడప కార్పొరేషన్: ప్రభుత్వ రంగ సంస్థలను, ఉద్యోగ హక్కులను కాపాడుకోవాల్సిన అవసరముందని జేఏసీ నాయకులు బండి రామలింగారెడ్డి, బర్నబాస్, చలపతి పిలుపునిచ్చారు. బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం విద్యుత్ భవన్ ముందు జేఏసీ నాయకులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజం కోసం, దేశం కోసం, మన హక్కుల కోసం పోరాటం చేయడానికి తాము సమాయత్తమయ్యామన్నారు. కార్మికుల శ్రమ, కష్టం, త్యాగాలే ఈ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అన్నారు. కానీ కార్మికుల కష్టానికి తగిన గౌరవం, సమాన వేతనం, సురక్షిత పని వాతావరణం లభిస్తున్నాయా...అని వారు ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక చట్టాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. ఈ చట్టాలు కార్మిక సంఘాలను బలహీన పరచడం, ఉద్యోగ భద్రతను తొలగించడం, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించడం లక్ష్యంగా పెట్టుకున్నాయన్నారు. వీటిని వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్, రైల్వే, బ్యాంకులు, బొగ్గు గనులు వంటి కీలక రంగాలను ప్రైవేటీకరణ చేయడం ద్వారా లక్షలాది ఉద్యోగాలు ఊడుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ డిస్కంల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ లక్షల మంది కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నారని తెలిపారు. భారత రాజ్యాంగం ఆర్టికల్ 39(ఈ) ప్రకారం స్త్రీ, పురుషులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెబుతోందని, అసంఘటిత రంగంలోని కార్మికులు, మహిళా కార్మికులు ఇప్పటికీ తక్కువ వేతనాలతో పని చేస్తున్నారన్నారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం కింద పనిగంటలను 8 గంటల నుంచి 10 గంటలకు పెంచడం దారుణమన్నారు. యూనియన్ నాయకులు మల్లికార్జునరెడ్డి, బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఎనర్జీ అసిస్టెంట్లకు నూతన సర్వీసు రూల్స్ రద్దుచేసి పాత సర్వీసు రూల్స్ అమలు చేయాలన్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాగశేషారెడ్డి, హర్ష నాయక్, ప్రతాపరెడ్డి, రామక్రిష్ణ, రఫీ, రవి చంద్ర, మురళి, లక్ష్మినారాయణ, వేణుగోపాల్, నాగిరెడ్డి, సురేష్, దస్తగిరి, గురుస్వామి, అన్ని యూనియన్, అసోసియేషన్ నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను హరించడం దారుణం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను హరించడం దారుణమని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్ రెడ్డి అన్నారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మహా ధర్నా విద్యుత్ భవన్ వద్ద నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 40 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం మార్చుతోం దని, దీని వలన కార్మిక వర్గం సాధించుకున్న హక్కులను పోగొట్టు కోవలసి వస్తుందని పేర్కొన్నారు. డిస్కమ్ అధ్యక్షులు ఎన్. శివ శంకర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసరెడ్డి , జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, బి ఎన్, నాగసుబ్బయ్య, ఈ. శ్రీహరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి నాయబ్ రసూల్, కే కిరణ్ కుమార్ , యునైటెడ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిస్కం అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. వెంకటరమణ, జిల్లా నాయకులు కె.వి సురేంద్రబాబు, నాగమల్లయ్య, బండి రామ్మోహన్, అమర్నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్‌ను పునరుద్ధరించాలి



బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: బీఎస్ఎన్ఎల్‌ను పునరుద్ధరించడంలో బీజేపీ ప్రభుత్వం అనేక అడ్డంకులు సృష్టిస్తోందని ఏఐబిడి పిఎ ఆల్ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దారుణమైన పరిస్థితి ఒక్క బీఎస్ఎన్ఎల్ కి మాత్రమే కాదు కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధానాలవల్ల బ్యాంకింగ్, ఇన్స్యూరెన్స్, ఆయిల్, స్టీల్, రైల్వే, రక్షణ, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలన్నీ తీవ్ర దాడిని ఎదుర్కొంటున్నాయన్నారు. స్వాతంత్ర్యానికి ముందు, ఆ తర్వాత కూడా భారత కార్మికవర్గం అనేక వీరోచిత పోరాటాలు చేసిందని దాని ఫలితంగా కార్మికుల హక్కులకు రక్షణ కల్పిస్తూ 29 కార్మిక చట్టాలు అమలులోకి వచ్చాయన్నారు. ఇప్పుడు వాటిని రద్దుచేసి కార్మిక వర్గ హక్కులను పూర్తిగా కాలరాసే 4 లేబర్ కోడ్స్ తెస్తున్నారు. దీనివల్ల కార్మిక సంఘాల ఉనికి ప్రమాదం లో పడుతుందన్నారు. అందువల్ల 29 లేబర్ కోడ్స్ ను రద్దు చేయరాదని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రెడ్డప్ప, జయచంద్ర, ఆకుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయడం తగదు



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

కడప సెవెన్‌రోడ్స్ : ప్రభుత్వ రంగ సంస్థలను, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తక్షణమే విడనాడాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ.రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఆ సంఘం అధ్యక్షులు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని డివిజనల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న పార్లమెంటు సమావేశాల్లో బీమా చట్టాల సవరణ బిల్లు ప్రవేశపెట్టనున్నారని, తక్షణమే ఈ ఆలోచన విరమించుకోవాలన్నారు. ఎల్ఐసీలో ప్రభుత్వం తన వాటాలను ఉపసంహరించుకునే కార్యక్రమాన్ని మరోమారు చేపట్టనుందని తెలిపారు. ఇందువల్ల సంస్థకు, పాలసీదారులకు ఏ రకమైన ప్రయోజనం లేదన్నారు. పనిభారం బాగా పెరిగిందని, 3, 4 తరగతుల సిబ్బంది కోసం రిక్రూట్‌మెంట్ తక్షణమే చేపట్టాలన్నారు. దేశంలో రాజస్థాన్, మరో నాలుగు రాష్ట్రాలు కొత్త పెన్షన్ విధానానికి స్వస్తి పలికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తున్నాయన్నారు. ఎల్ఐసీలో కూడా పాత పెన్షన్ అమలు చేయాలన్నారు. పర్యాటకశాఖ రిటైర్డ్ డైరెక్టర్ గోపాల్, ఎల్ఐసీ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి సుధీకర్, క్లాస్-1 ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, సలాం, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, ఏపీజీబీ ఆఫీసర్స్ తదితరులు సంఘీభావం వ్యక్తం చేశారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు, అతిథులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మత్తు పదార్థాలకు అలవాటుపడితే భవిష్యత్తు అంధకారమవుతుందని, యువత మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకోవద్దని వక్తలు పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ।ఈగల్‌। టీం ఆధ్వర్యంలో కడప నగరంలోని ఫాతిమా వైద్య కళాశాలలో బుధవారం యాంటి డ్రగ్స్ అవేర్ నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలు ఉన్నతమైన స్థాయిలో ఉంటారని కలలు గంటారని, వారి కలలను కొందరు మత్తుకు అలవాటు పడి కల్లలుగా చేస్తున్నారన్నారు. మత్తు పదార్థాల సేవనం వల్ల మైండ్‌తో పాటు, విచక్షణా శక్తిని కోల్పోతున్నారని, సామాజిక, మానసిక, శారీరక, అనారోగ్యాలు, ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతూ సమాజం నుండి దూరమవుతున్నారన్నారు. కళాశాల సమీప ప్రాంతాలలో కానీ చుట్టుపక్కల ప్రాంతాలలో కానీ ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం తెలిస్తే వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 ద్వారా సమాచారం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల చేత అతిథులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ తులసి నాగ ప్రసాద్, ఫాతిమా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శైలా రేఖ, డాక్టర్ రామ మనోహర్ రెడ్డి, డాక్టర్ అల్తాఫ్ హుస్సేన్ అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ చౌదరి సేవలు మరువలేనివి

కడప అగ్రికల్చర్: వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్‌గా సేవలందించిన తూర్పు గోదావరి జిల్లా ఏపీ ఎన్జీవీఎఫ్ జిల్లా చైర్మెన్ శ్రీనివాస్ చౌదరి హఠాత్ మరణం సంఘానికి తీరనిలోటని ఏపీ ఎన్జీవీఎఫ్ వైఎస్ఆర్ జిల్లా చైర్మెన్ యస్.రాజశేఖర్ అన్నారు. బుధవారం కడపలోని వెటర్నరీ పాలి క్లినిక్‌లో శ్రీనివాస్ చౌదరి మృతికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జిల్లా పశు సంవర్థశాఖ అధికారి డాక్టర్ శారదమ్మతోపాటు వెటర్నరీ సహాయ సంచాలకులు, డాక్టర్స్ నివాళులు అర్పించారు.

ఘనంగా నాదర్‌షా వలీ దర్గా ఉరుసు



ప్రార్థనలు చేస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: మొహర్రం పురస్కరించుకొని కడప నగరంలో ఇంటర్నేషనల్ కళ్యాణ మండపం సమీపంలోని నాదర్ షా వలీ దర్గాలో నిర్వహించిన ఉరుసు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బుధవారం రాత్రి ఈ ఉరుసు ఉత్సవాల్లో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు పాల్గొన్నారు. ముందుగా అల్మాస్‌పేట నుంచి ఫకీర్ల ఊరేగింపులో వారు మమేకమయ్యారు. ఫకీర్ల విన్యాసాలను తిలకించారు అల్మాస్ పేట నుంచి ప్రారంభమైన ఈ ఊరేగింపు కేసీ కెనాల్ వరకూ సాగింది. అక్కడ దర్గాలో పూల చాదర్‌లు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంపీ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ మొహర్రం పండుగ సందర్భంగా జరిపే ఈ ఉరుసు మత సామరస్యానికి ప్రతీక అన్నారు. మతాలకు అతీతంగా ప్రజలు ఇందులో పాల్గొంటారని, ఈ సందర్భంగా ప్రజలందరికీ మేలు జరగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, సుభాన్ బాషా, పవర్ అల్తాఫ్, అక్బర్, చాక్లెట్ గౌస్, రఫీ, షంషీర్, ఐస్‌క్రీం రవి, దేవిరెడ్డి ఆదిత్య, అజ్మతుల్లా పాల్గొన్నారు.

బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగాలు

కడప ఎడ్యుకేషన్: బ్యాంకింగ్ రంగంలో ప్రభుత్వ ఉద్యోగంతో కెరీర్‌ను ప్రారంభించాలనుకునే యువతకు పీఓ పోస్టులు అద్భుత అవకాశాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)ఇచ్చిందని రీజినల్ మేనేజర్ నుతన్ కుమార్ అన్నారు. బుధవారం యోగి వేమన యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్మెంట్ శాఖ విభాగాధిపతి డాక్టర్ పి.సరిత , వైవీయూ ఎస్‌బీఐ బ్యాంక్ సంయుక్త ఆధ్వర్యంలో ఎంబీఏ విద్యార్థులకు పీఓ ఉద్యోగ నియామకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌బీఐ రీజినల్ బ్రాంచ్ హెచ్‌ఆర్ మేనేజర్ ఆర్.సైకుమార్ పీఓ ఉద్యోగానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలి, సిలబస్, ప్రిపరేషన్ మాడ్యూల్ గురించి వివరించారు.

సబ్ జూనియర్ బాలుర ఫుట్ బాల్ జట్టు ఎంపిక



ఎంపికైన సబ్ జూనియర్ బాలుర ఫుట్ బాల్ జట్టు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాలుర ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరి డేనియల్ ప్రదీప్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. ఎంపికైన జట్టు ఈ నెల 11వ తేదీన అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగే జోనల్ స్థాయి పోటీలలో పాల్గొనవలసి ఉంటుందన్నారు. జోనల్ స్థాయిలో గెలుపొందిన జట్టు రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ తామస్ జీవన్ బాబు, ఫుట్‌బాల్ కోచ్ హరి, డాక్టర్ వైఎస్ఆర్ స్పోర్ట్స్ స్కూల్, అసోసియేషన్ సభ్యులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు గురుపౌర్ణమి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రతి యేటా ఆషాడ మాసంలో వచ్చే శుద్ధ పౌర్ణమిని గురుపౌర్ణమిగా పాటిస్తారు. వేద వ్యాసుడు జన్మించిన రోజు గనుక వ్యాస పౌర్ణమిగా కూడా పిలుస్తారు. తమ జీవితాలకు మార్గదర్శనం చేసిన గురువులను గౌరవించే ఈ పండుగను భారతదేశంలోనే కాకుండా నేపాల్, భూటాన్ దేశాల్లో హిందువులు, జైనులు, బౌద్ధులు ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. గురుపూజోత్సవం నిర్వహించి గురువులను సత్కరించి ఆశీర్వాదాలు పొందడం భారతీయ సనాతన సంప్రదాయంలో ఒక ఆచారంగా వస్తోంది. గురుపౌర్ణమిరోజు కొంతమంది ఉపవాసం ఉంటారు. సూర్యోదయం వేళ ఆరంభించి చంద్రోదయం చూసిన తర్వాత ఉపవాసకులు ఆహారం స్వీకరిస్తారు. గురువారం గురుపౌర్ణమి కావడంతో నగరంలోని ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించనున్నారు. గడ్డిబజారులోని శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో ఉదయం సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ వంశపారంపర్య అర్చకులు విజయ్‌భట్టర్ తెలిపారు. పుష్పగిరి లో శ్రీ పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.భారవి ఆధ్వర్యంలో గిరి ప్రదిక్షణ కార్యక్రమం జరగనుంది.

గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

కడప రూరల్ : వనిపెంట మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మలాదేవిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు ఎదురూరు బాబు తెలిపారు. ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఆ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు దాసరి జ్యోతి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతోంది. బుధవారం ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మలాదేవి ఎస్సీ వర్గానికి చెందిన ఉద్యోగులతోపాటు విద్యార్థుల పట్ల కుల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఆమె ఆరోపణలు తట్టుకోలేక ఉపాధ్యాయురాలు జ్యోతి ఆత్మహత్యా యత్నానికి పాల్పడటం దారుణమన్నారు. ఈ అంశానికి సంబంధించి అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విలియం, కొట్టం సుబ్బారావు, మున్నెల్లి కనకరాజు, మౌలాలి, ఏసురత్నం, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావం

కడప ఎడ్యుకేషన్: యూనివర్సిటీలో ఆర్కిటిక్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు సరైన సదుపాయాలు కల్పిస్తేనే వారు నాణ్యమైన విద్యను పొంది భవిష్యత్తులో రాణించగలరని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. కడప నగర శివార్లలోని ఏఎఫ్‌యూలో తమ సమస్యల సాధనకై గత 8 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న డాక్టర్ వైయస్ఆర్ ఆర్కిటిక్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులకు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి బుధవారం సంఘీభావం తెలిపారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకుని యూనివర్సిటీ వీసీ విశ్వనాథ కుమార్ తో చర్చించారు. అనంతరం వారి ప్రధాన డిమాండ్లైన యూనివర్సిటీకి (సీవోఏ) కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, (ఐటీపీఐ) ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా సంస్థల అనుమతికి సంబంధించి ఆ సంస్థల ఉన్నతాధికారులతో మాట్లాడి అనుమతులకు మార్గం సుగమం చేయడంతో వారు నిరాహారదీక్షను విరమించారు.

వర్క్‌షాప్ సద్వినియోగం చేసుకోవాలి

కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఇన్‌ఛార్జ్ సెక్రటరీ, జడ్జి కె. ప్రత్యూషకుమారి బుధవారం న్యాయసేవాసదన్‌లో శిక్షణ పొందిన మధ్యవర్తులకు (న్యాయవాదులు) ఒకరోజు వర్క్‌షాపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి కె. ప్రత్యూషకుమారి మాట్లాడుతూ వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీనియర్ ట్రైనర్ లు మాట్లాడుతూ మధ్యవర్తిత్వ ప్రతిష్టంభనలు, రాజీ ఒప్పందాలను అధిగమించడం, ఆధునిక మధ్యవర్తిత్వ సవాళ్లను నావిగేట్ చేయడం, ప్రతిష్టంభన రకాలు, కేస్ స్టడీస్, గ్రూప్ యాక్టివిటీ, అధునాతన సాధనాలు, రోల్ ప్లే ఫెసిలిటేటర్లు, చట్టబద్ధంగా మంచి ఒప్పందాల నిర్మాణం, నమూనా ఒప్పందాలను రూపొందించడం, బహుళ పార్టీ సాంస్కృతిక ఒప్పంద వ్యూహాలు మొదలగు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో న్యూఢిల్లీకి చెందిన అడ్వకేట్, సీనియర్ ట్రైనర్ అనూష సక్సేనా, మధ్యప్రదేశ్‌కు చెందిన అడ్వకేట్ కం సోషల్ వర్కర్ కం సీనియర్ ట్రైనర్ మీనా కేర్‌తో పాటు, శిక్షణ పొందిన మధ్యవర్తులు (న్యాయవాదులు) పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం

కడప ఎడ్యుకేషన్: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం అయిందని ఏఐఎఫ్‌డిఎస్ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్ తెలిపారు. బుధవారం జరిగిన సార్వత్రిక సమ్మెకు అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో మద్దతు తెలిలిపామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కష్టాలు దృష్టిలో పెట్టుకొని నడుచు కోవాలన్నారు. వారికి ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు వారికి కేటాయించిన ఎనిమిది గంటల పని దినాలు రక్షించాలన్నారు.

వైఎస్ఆర్‌సీపీలో దళితులకు అధిక ప్రాధాన్యత



బూసిపాటి కిశోర్‌ను సన్మానిస్తున్న దళిత సంఘాల నాయకులు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నూతనంగా నియమితులైన సీనియర్ నేత బూసిపాటి కిశోర్‌ను దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బుధవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. మాజీ సోషియల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్, వైఎస్సార్‌సీపీ మాజీ ఎస్సీ సెల్ ఛైర్మన్ సీహెచ్ వినోద్ కుమార్, ప్రస్తుత ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎస్. వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి త్యాగరాజు, కార్పొరేటర్ కె. బాబు, కమలాపురం మాజీ సర్పంచ్ దానంల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా జిల్లా నుంచి నియమితులైన మొదటి దళిత నేత బూసిపాటి కిశోర్ అన్నారు. ఆయనకు సరైన గుర్తింపు ఇవ్వడం ద్వారా వైఎస్సార్‌సీపీలో దళితులకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లయ్యిందన్నారు. ఆ తర్వాత కి షోర్ బూసిపాటి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయిలో సంయుక్త కార్యదర్శిగా నియమించినందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ వైద్య విభాగం ఇసీ సభ్యులు డా. పెంచలయ్య, నాయకులు మేసా ప్రసాద్, శ్రీరాములు, లారెన్స్, సంపత్, రమణ, కన్నయ్య, ప్రవీణ్, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి రత్నకుమారి, ఉపాధ్యక్షురాలు మల్లీశ్వరి, జ్యోతి, చైతన్య పాల్గొన్నారు.